# సురుచి

జె.ఎస్.వి. ప్రసాద్

బ్యాక్...టు ద హోమ్...! ఉద్యోగబాధ్యతల నుంచి అతికష్టం మీద వాలుగా సంవత్సరాల తర్వాత విముక్తి లభించింది. క్షణం ఆలస్యం చేయకుండా రెక్కలు కట్టుకుని పుట్టిన గడ్డమీద వాలిపోయాం నేను, భారతీ. ఇంకో ఆరు సంవత్సరాలు అక్కడే ఉండి సంపాదించుకునే అవకాశం ఉన్నా... 'మంచి ఆదాయాన్ని వదులుకుని వచ్చెయ్యవద్ద'ని సన్నిహితులు సలహాలు ఇచ్చినా... ఆగలేకపోయాం. అందులో కనీసం మూడువంతులు ఇక్కడా సంపాదించగలనన్న ధైర్యం ఉంది నాకు. అవకాశాలూ ఉన్నాయి.

పుట్టింటి దగ్గర్లోకి వచ్చేసినందుకు 'భారతి'కైతే మరీ సంతోషంగా ఉంది.

"పిల్లల్ని కూడా తీసుకువచ్చేయాల్సింది...!" అన్నారు నాన్న.

"ఇంకో సంవత్సరంలో చిన్నవాడి చదువైపోతుంది నాన్నగారూ. అంతవరకూ పెద్దాడే తమ్ముడి బాధ్యత చూసుకుంటానన్నాడు. తనకెలాగూ మంచి జాబ్ దొరికిందక్కడ. వాళ్లకి 'ఇండివిద్యువాలిటి' అలవాటవుతుంది కదాని... వాళ్లని ఉంచేసి తగిన ఏర్పాట్లన్నీ చేసి వచ్చేశాం. పైగా ఉంటే నేను మరో ఆరేళ్లు ఉండిపోవాలి" అన్నాను.

"ఎంత చిక్కిపోయావో నాయనా...!" అంటూ నా ఒళ్లు నిమురుతూ అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది.

"బొజ్జ వచ్చేసింది... బరువు పెరిగిపోతున్నానన్నావ్ కదా నువ్వు...!?" రహస్యంగా అన్నాను 'భార్య'తో. ఎవరూ చూడకుండా గట్టిగా 'కాడపాశం' పెట్టేసింది.

చాలా సంవత్సరాల తర్వాత ఆరోజు 'అమ్మచేతి 'అమృతం' లాంటి భోజనం తిన్నాను. అమ్మే తినిపించింది. మనసులోని ప్రేమే కదా - కంటి చూపుతో, నోటి మాటతో, చేతి వంటలో 'అమృతం' నింపేది...!?'

* * *

మీరు మళ్లీ ఏ ఉద్యోగంలోనో... వ్యాపారంలోనో పడిపోతే ఎట్లా

కదలనంటారు, ఒకసారి మా ఇంటికి వెళ్లొచ్చేద్దామండీ...! గోముగా అడిగింది 'భారతి'.

అదీ నిజమే అనిపించి... "ఓ...కే..!" అన్నాను. 'నూజివీడు' వెళ్లొచ్చేశాక భీమవరం వెళ్లి 'శ్రీలతని, జయరాం'ని కూడా చూసొచ్చేయాలనుకున్నాం. ఆ తర్వాత ముఖ్యమైన బంధువుల్నీను. 'న్యూజిలాండ్' పరువు వాడడం మానేశాక, వాళ్లకి 'శ్రీజ' తర్వాత మరో 'బాబు' కూడా పుట్టేసాడు. వాడిక్కూడా అమ్మా నాన్నల పేర్లలోని అక్షరాలు కలిపి 'శ్రీరాం' అని పేరు పెట్టారట. పేర్లు బాగా కలిసాయని చాలా సరదా పడ్డాం అందరం...!

మా అత్తగారింటి కెళ్లిన రెండు రోజులకి – 'భారతి' చిన్నాన్న భాస్కర్రావుగారు వచ్చి మమ్మల్నిద్దర్నీ వాళ్లింటికి భోజనానికి రమ్మని ఆహ్వానించారు.

ఆయన వెళ్లిపోయాక మా అత్తగారు భారతితో చెప్పారు. "మీరు వచ్చేస్తారని తెలిసిన దగ్గర్నించి మీ 'సీతామహాలక్ష్మి' మామ్మ, 'సూర్యావతి' పిన్ని నిన్ను చూడాలని తెగ కలవరిస్తున్నారే... ఆ మధ్య మామ్మకి చాలా సుస్తీ చేసింది కూడా. ఓ గంట ముందు బయలుదేరివెళ్లి వాళ్లని చూసి, అటునుంచి చిన్నాన్నగారింటికి వెళ్లండి".

సీతామహాలక్ష్మి' గారంటే మా మామగారి



మేనత్తట. బాగా చితికిపోయిన కుటుంబం. 'భారతి' పుట్టిన చాలాకాలం వరకూ వీళ్లింట్లోనే ఉంది. తన చేతులమీదే పెంచిందట. అందుకే భారతి అంటే చాలా ప్రేమ ఆవిడకి.

"ఇప్పుడెక్కడ ఉంటున్నారమ్మా వాళ్లు...?" ఆతృతగా అడిగింది భారతి.

"రంగ బాబాయ్ పోయాక వాళ్లు 'బాలాజీ సింగ్' గారి మామిడి తోటల్లో పనికి వెళ్లిపోయారు. పిన్ని కొడుకు 'సురేష్' పెద్దవాడయ్యాడు. వాడే ఆ తోట పని చూసుకుంటూ వాళ్లని పోషిస్తున్నాడు. తోటలోనే చిన్న ఇల్లు" అన్నారు మా అత్తగారు.

భారతి నావైపు సాభిప్రాయంగా చూసింది. నేను తలాడించాను. మా బావమరిది అడ్రస్ వివరంగా చెప్పాడు.

పళ్లూ, స్వీట్లూ తీసుకుని, అతని బైక్ మీదే బయల్దేరాం. అడ్రస్ సులువుగానే దొరికింది. ప్రసిద్ధిచెందిన నూజివీడు చెరుకురసాల తోటది! ఆ పెద్ద తోటలో... చిన్న తాటాకుల ఇల్లు...! వంగి లోపలకు వెళ్లాం.

వాళ్లు పట్టలేనంత ఆనందంతో మమ్మల్ని ఆహ్వానించారు. సీతామహాలక్ష్మిగారు భారతిని దగ్గరకు తీసుకుని 'ఎంత చిక్కిపోయావమ్మూలూ...!' అన్నారు ప్రేమతో కళ్లు తడి అవుతూంటే...!

"అబద్ధం...!" అన్నాను నేను నవ్వుతూ...

"నిజమే బాబూ... ఈ ఊళ్లో దీని వయసు పిల్లల్ని చూడండి... గుమ్మటాల్లా తయారైపోయారు. ఈ అమ్మాయి మాత్రం ఇలాగే ఉండిపోయింది...!" అన్నారు.

"అది నా అదృష్టం...!" అన్నాను మళ్లీ నవ్వి.

పళ్లూ, స్వీట్లూ వాళ్లచేతిలో పెట్టి కుశల ప్రశ్నలు వేసి సలహాలు కూడా చెప్పింది భారతి. వేసవిలో కూడా ఆ యిల్లు చల్లగా, హాయిగా ఉంది.

ఆ తల్లీకూతుళ్లిద్దరూ ప్రక్కగదిలోకి వెళ్లి హైరానా పడిపోతున్నారు. నాకర్థమైంది... వాళ్ల దృష్టిలో నేనొక మహారాజుని. పైగా అల్లుడి వరస! మర్యాదల కోసం ఏం తేవాలన్నా చాలా దూరం వెళ్లాలి. ఇంట్లో మగవాళ్లెవ్వరూ లేరు. వాళ్లబ్బాయి సురేష్ పనిమీద ఎక్కడికో వెళ్లాడు. ఎప్పుడొస్తాడో తెలియదు.

వాళ్లు 'భారతి'ని పెరట్లోకి పిలిచి ఎందుకో బ్రతిమాలుతున్నారు. తను వాళ్లకి నచ్చచెబుతోంది. భోజనం చేసి వెళ్లమంటున్నారని నాకు అర్థమయింది. మరో పదినిమిషాలు వాళ్లంతా ఏవేవో మాట్లాడుకున్నారు. మాటల్లో ఉండగానే కమ్మటి వాసన గదిలో వ్యాపించింది.

కాసేపటికి ఆ గదిలో ఒకమూల ఉన్న కర్ర స్టూల్ మీద ట్రంకుపెట్టె తీసి క్రిందపెట్టి, స్టూల్‌ని నేను కూర్చున్న దగ్గరికి లాగారు సూర్యావతి గారు. రెండు ప్లేట్లతో వేడివేడి ఉప్మా తెచ్చి స్టూల్‌మీద పెట్టి చల్లారడానికి విసనకర్రతో విసరసాగారు మామ్మగారు.

టిఫిన్ చేసే వచ్చామని చెప్పినా వినలేదు. మేము విసురుకుంటామన్నా వినలేదు. హడావిడి పడిపోతూ ఖంగారుగా చేసిన ఉప్మా అది. ఆ ఖంగారులో ఉప్పు మరిచిపోయారో లేక తక్కువయిందో... చప్పగా, ఉడికీ ఉడకనట్టుగా కూడా ఉంది. కానీ – స్వచ్ఛమైన వాళ్ల ప్రేమానురాగాల కలయికతో ఆ 'రుచి' 'సురుచి'గానే అనిపించింది. భారతి నా'సైగ'ను అర్థం చేసుకుంది. మొహంలో ఏ భావమూ కనిపించకుం

డా తినేశాం ఇద్దరం. మొత్తం మాకే వడ్డించేసారు కనుక జరిగిన పొరబాటు వాళ్లకి తెలిసే అవకాశం లేదు. "ఏదో మాకు వచ్చినట్టు చేసేశాం. మీ ఆయనకు నచ్చిందో లేదోనే అమ్ములూ..." అంటూ ఇబ్బందిగా ఫీలవుతూ భారతి చెవిలో చిన్నగా అన్నారు సీతామహాలక్ష్మి మామ్మగారు.

"అబ్బే... చాలా బాగుంది మామ్మగారూ, మీ మనవరాలి కన్నా బాగా చేసారు" అన్నాను మనస్ఫూర్తిగా.

వచ్చేసేటపుడు ఆవిడ భారతికి బొట్టుపెట్టి, గాజులేయించుకోమని పాతిక రూపాయలిచ్చారు.

భారతి వాళ్ల పిన్నిచేతిలో బలవంతంగా కొంత డబ్బు పెట్టి మందులు వాడుతూండమని చెప్పి వచ్చేసింది.

* * *

"ఇకచాలు లేవండి... మిగతాది నేను రాస్తాను" అన్నమాటలు వినబడి వెనక్కితిరిగాను. భారతి...!

"నువ్వురాస్తావా...?" అన్నాను ఆశ్చర్యంగా.

'ఏం? ఎందుకు రాయలేను...!? ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించిన న్...!' అంటూ ఎడమచేయి నడుంమీద వేసుకుని, కుడిచేత్తో పొడవాటి జడని గిరగిర త్రిప్పింది సత్యభామ ఫోజులో నిలబడి! నేను చెంపలు వేసుకుని, కుర్చీఖాళీచేసి... పెన్ చేతికిచ్చాను. ఆవిడ పెన్ అందుకుంది 'స్టయిల్'గా!

* * *

అక్కణ్ణించి మా చిన్నాన్నగారింటికి వెళ్లేసరికి ఏదో తింటూ హాల్లో పచార్లు చేస్తూ కనిపించింది పిన్ని. తన నోటిని కంట్రోల్ చేసుకోవడం అస్సలు చేతకాదు కానీ శరీరాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవాలని చాలా శ్రమపడుతూ కుదురుగా కూర్చోకుండా పాపం అలా 'వాకింగ్' చేస్తూనే ఉంటుంది... ఏదో ఒకటి తింటూ...!

మమ్మల్ని చూడగానే 'రండి... రండి...' అంటూ ఆహ్వానించింది కానీ ఆమె మొహంలో ఏ భావమూ కనిపించలేదు.

"కాసేపట్లో మీ చిన్నాన్న గారొచ్చేస్తారు. అందాకా ఈ చల్లని జ్యూస్ త్రాగండి" అంటూ 'జ్యూస్' ఇచ్చింది. నన్నూ, ఆయన్నీ ఏవేవో కుశలప్రశ్నలు వేసింది వాకింగ్ చేస్తూనే.

తర్వాత హఠాత్తుగా నావైపు తిరిగి "నీకు బాగా వళ్లొచ్చేస్తున్నట్టుంది అమ్ములూ... డైటింగూ, ఎక్సర్‌సైజులూ చేస్తుండు" అంది నన్ను నిలువెల్లా గుచ్చిగుచ్చి చూస్తూ... ఇంటికి భోజనానికి పిలిచి 'డైటింగ్' చెయ్యమనేంత 'తెలివి' ఇంకెవరికైనా ఉంటుందా?

ఆవిడ గుణం నాకు బాగా తెలుసు. తన 'లావు'ని, ఎదుటివాళ్ల 'నాజూకు'నీ, కల్లో కూడా ఒప్పుకోదు. పైగా తన కొడుక్కి మా ఆయనతో పాటు సింగపూర్‌లో ఉద్యోగం చూడలేదని మా మీద పీకల వరకూ పైకి కనిపించనంత కోపం కూడా ఉంది.

నేను ఓరగా ఆయనవైపు చూసాను... ఆయన నవ్వాపుకుంటున్నారు.

'మీలా విదేశాల్లో ఉద్యోగం చెయ్యకపోయినా, నా కొడుకూ ఇక్కడ బాగానే సంపాదిస్తున్నాళ్లే...! కోచింగ్ సెంటర్ పెట్టాడు. పది కంప్యూటర్లు కొని, అవి కూడా నేర్పిస్తున్నాడు. నెలకి పాతిక వేలు సంపాదిస్తున్నాడు రాజాలాగ...! మీ చిన్నాన్నగారి సంపాదన కూడా తక్కువేమీ

కాదు కదా...!" అంటూ ఇంకా చెప్పేస్తోంది.

నాకు ముళ్లమీద కూర్చున్నట్టుంది... "ఇంత సేపయినా రమ్య బయటకు రాలేదేం పిన్నీ...? ఉండు చూసొస్తాను" అంటూ వంక కల్పించుకుని గబగబా లోపలకు నడిచాను. మావార్ని వదిలేసి, పాపం...! అని జాలిపడుతూ...

"జడని పొడుగ్గా బాగానే పెంచుతున్నావ్ కానీ అక్కడక్కడా తెల్లవెంట్రుకలొచ్చేస్తున్నాయే...!" అంటూ నావెనుకే వచ్చేసింది పిన్ని. మనసులోనే నెత్తికొట్టుకుని, వెనక్కి తిరిగి నవ్వాను. "ముసలిదాన్నైపోతున్నాను కదా పిన్నీ...! కాలేజీలో చదివే ఇద్దరు పిల్లల తల్లిని కదా...!?' ఆ మాటతో ఆవిడ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. మరి నేనే ముసలిదాన్నైతే... నాకంటే పెద్దది... తను ఇంకా ముసలిదవ్వాలి కదా...?

కిచెన్‌లో రమ్య, వాళ్ల వంటమనిషీ బిజీగా ఉన్నారు. అత్తగారిలా కాదు... రమ్య చాలా సరదాగా మాట్లాడుతుంది. ఇద్దరం మాట్లాడుకుంటూంటే మళ్లీ మా మధ్యకు వచ్చేసింది పిన్ని. నా మెళ్లో నగల్ని పట్టిపట్టిచూస్తూ "సింగపూర్‌లో ఉన్నది కొన్నాళ్లే అయినా నిన్ను బాగానే 'సింగారించారే' అల్లుడుగారు..." అంది.

అసలెందుకొచ్చాన్రా భగవంతుడా అనుకున్నాను మనసులోనే...! పన్నెండు అవుతూండగా వచ్చాడు చిన్నాన్న. కుశలప్రశ్నలన్నీ మళ్లీ మొదటికొచ్చాయ్. సరదాగానే మాట్లాడాడు. అల్లుడుగారి మీద జోకులూ వేసాడు.

కాసేపటికి రాజేష్ కూడా వచ్చాడు. 'హాయ్ అక్కా' అని నన్ను, 'హాయ్ బావగారూ బాగున్నారా' అని ఆయన్నీ పలకరించాడు. స్వతంత్రంగా సంపాదించుకోవడంలో తను అనుభవిస్తున్న ఆనందాన్ని వర్ణించి చెప్పాడు. ఎందుకు చెప్పాడో మాకు తెలుస్తోంది...! అందరం భోజనాలకు కూర్చున్నాం. రెండు కూరలు, పచ్చళ్లు, పప్పు, ఫ్రై, సాంబారు, బిర్యాని, గారెలు, పాయసం, స్వీట్స్, ఫ్రూట్స్, సలాడ్స్‌తో ఫైవ్‌స్టార్ హోటల్‌లో భోజనంలా ఉంది విందు...!

> **నవ్వాలనిపించేకందాలు...!**
>
> శీర్షికను అనివార్యకారణాల వల్ల ఈసారి ప్రచురించలేకపోయాం.
>
> - ఎడిటర్

భోజనాలు అయ్యాక అందరికీ 'కిళ్లీ'లు ఇచ్చాడు చిన్నాన్న.

'ఒక్కొక్కటీ పదేసి రూపాయలన్నమాటేగానీ రుచీ, పచీ లేవు...!' ముఖం వికారంగాపెట్టి, అన్యాపదేశంగా అంది పిన్ని. అలా ఎందుకు నొక్కిచెప్పిందో నాకు తెలుసు.

అతికష్టం మీద అక్కడ మరో గంట గడిపి... హమ్మయ్య అనుకుంటూ బైటపడ్డాం.

ఆయనేమంటారో వినాలనిపించి, దారిలో అడిగాను... 'భోజనం ఎలాగుందండీ?' అని...!

ఆయన కొద్దిగా తల త్రిప్పి, చిన్నగా నవ్వారు! 'రుచి పదార్థాల్లో ఉండదు భారతీ... వడ్డించేవారి మనసులో, మాటల్లో, చేతల్లో ఉంటుంది. మీ మామ్మగారింట్లో ఉప్మా వెయ్యిరెట్లు బాగుంది' అన్నారు. అచ్చం నేననుకున్నట్టుగానే...!

అవును మరి - మా ఆత్మలు ఒకటే అయినప్పుడు అభిప్రాయాలూ ఒకటే కదా...!

* * *

"ఎక్సలెంట్ డియర్... చాలా బాగా రాసావ్...!" అన్నాను ఆనందంగా తనకి 'షేక్‌హాండి'స్తూ...! గర్వంగా కళ్లెగరేసి ఫక్కుమని నవ్వింది 'భారతి' - దంత 'రుచులు' గదిలో, నా'మది'లో నిండేలా...! ●